క్లుప్తంగా

విద్యార్థులకు అభినందనలు



పల్లా భరత్ చంద్రను అభినందిస్తున్న కలెక్టర్, జేసీలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఐఐటీలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన పల్లా భరత్ చంద్ర, బి.రోహిత్ దత్‌లను స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం అభినందించారు. భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఆయనతో పాటు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్, జెడ్పీ సీఈవో ఎల్ఎన్‌వీ శ్రీధర్ రాజ తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఏవో బాబ్జీ

జి.సిగడాం: రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులను విక్రయించాలని, లేనిపక్షంలో సంబంధిత డీలర్ లైసెన్స్ రద్దు చేసి క్రిమినల్ కేసులను నమోదు చేస్తామని మండల వ్యవసాయశాఖ అధికారి బెండు బాబ్జీ హెచ్చరించారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే రైతుసేవా కేంద్రాల ద్వారా ఎరువులను సరఫరా చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని తెలియజేశారు. ఎక్కడైనా నకిలీ ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.


ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు



రణస్థలంలోని ఎరువుల దుకాణం తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారులు

రణస్థలం: మండలంలోని కోష్ట, రావాడ, రణస్థలంలోని ఎరువుల దుకాణాల్లో రణస్థలం డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకుడు వి.శ్రీనివాసరావు ఆకస్మిక తనిఖీలు సోమవారం చేపట్టారు. దుకాణ యాజమాన్యాలు విధిగా ప్రతిరోజూ విత్తనాల నిల్వ, విక్రయం వివరాలు వ్యవసాయ అధికారి ఆఫీస్‌కు ఇవ్వాల్సిందిగా సూచించారు. ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని, లైసెన్స్‌లు రద్దు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. షాపు ముందు ఎరువులు, విత్తనాల నిల్వల వివరాలు బోర్డుపై ప్రతిరోజూ పొందుపరచాలని సూచించారు. రైతులకి విక్రయించిన ఎరువులకి రశీదు ఇవ్వాలన్నారు. తనిఖీల్లో రణస్థలం వ్యవసాయశాఖాధికారి డి.విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వస్త్రాలు పంపిణీ



పేదలకు వస్త్రాలను పంపిణీ చేస్తున్న నాయకులు

జి.సిగడాం: మండలంలోని సంతవురిటి గ్రామంలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు పుట్టిన రోజు సందర్భంగా పేదలకు దుస్తులను మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి పండూరి అప్పారావు, దొలూరి రామకృష్ణ, కూటమి నాయకులు బాలబొమ్మ వెంకటేశ్వరావు, శిర్రా గంగరాజు, దొలూరి వెంకటరమణ, కరజాడ హరికృష్ణ చేతులమీదుగా సోమవారం పంపిణీ చేశారు.

ఉత్తరేశ్వరునికి పూజలు



ప్రత్యేక అలంకరణలో ఉత్తరేశ్వరస్వామి

శ్రీకాకుళం కల్చరల్: బలగలోని ఉత్తరేశ్వరస్వామికి ఆషాఢ సోమవారం సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి పూజలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు.

అప్రమత్తతే శ్రీరామ రక్ష



మేత మేస్తున్న గొర్రెలు

- వర్షాకాలంలో జీవాలకు ప్రాణాంతక వ్యాధులు
- మేకలు, గొర్రెల్లో కాలివుండు వ్యాధులు
- జాగ్రత్తలు తీసుకుంటే మేలు

ఎచ్చెర్ల: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో జీవాలు వ్యాధుల బారిన పడుతుండడంతో పెంపకందారులు అనేక వ్యయప్రయాసలకు గురికావాల్సి వస్తోంది. వర్షాకాలంలో చెరువులు, కుంటలు, వాగులు, బావుల్లో ఒక్కసారిగా నీరు చేరి కలుషితమవుతుంటాయి. ఈ కలుషిత నీరు తీసుకోవడంతో పశువులకు వివిధ వ్యాధులు సోకే ప్రమాదముందని పశువైద్యాధికారులు చెబుతున్నారు. ప్రధానంగా మేకలు, గొర్రెల్లో కాలివుండు వ్యాధి వ్యాప్తిచెందే ప్రమాదముందని హెచ్చరిస్తున్నారు. వ్యాధుల బారిన పడకుండా రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగి ఉండాలని సూచిస్తున్నారు.

ఎచ్చెర్ల నియోజకవర్గంలో...

ఎచ్చెర్ల నియోజకవర్గంలోని ఎచ్చెర్ల మండలంలో 12,940 గొర్రెలు, 3,942 మేకలు ఉన్నాయి. జి.సిగడాం మండలంలో 18,420 గొర్రెలు, 2,940 మేకలు ఉన్నాయి. లావేరు మండలంలో 34,200 గొర్రెలు, 6,000 మేకలు ఉన్నాయి. రణస్థలం మండలంలో 52,340 గొర్రెలు, 4,500 మేకలు ఉన్నాయి. మేతకు వెళ్లే మేకలు, గొర్రెల మందలు వర్షాకాలంలో తడవడం, మురికి కుంటల్లో నిల్వ ఉన్న నీటిలో అధిక సమయం నిలిచి ఉండడం వల్ల సూక్ష్మజీవులు వాటి కాళ్లను ఆశించడంతో వ్యాధి బారినపడతాయి. అలాగే చిత్తడి నేలల్లో తిరగడం వల్ల ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. దీన్ని ముందుగా గుర్తించకుంటే మేక లేదా గొర్రెకు వచ్చిన వ్యాధి త్వరగా మందలోని మిగిలిన వాటికి వ్యాపిస్తుంది. ఈ సమస్యలను అధిగమించేందుకు సంబంధిత కాపరులు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్న తమ సిబ్బందిని లేదా పశువైద్య కేంద్రాల్లో వైద్యులను సంప్రదించాలని పశువైద్య సిబ్బంది సూచిస్తున్నారు.

వ్యాధి లక్షణాలు ఇలా...

కాలి పుండు సోకిన మేకలు, గొర్రెలు తొలుత నడకలో వెనుకబడతాయి. అలాంటప్పుడు వాటి గిట్టలను పరిశీలించాలి. గిట్టల మధ్య ఎర్రగా కందినట్లు ఉంటే కాలివుండు వచ్చినట్లు గుర్తించాలి. ఈ వ్యాధి సోకిన జీవాలు సరిగా మేత మేయవు, బరువు తగ్గుతాయి. గిట్టల మధ్య ఎర్రగా కందిన భాగం ఉబ్బి చీము పడుతుంది. అలాగే తీవ్రమైన చెడువాసన వస్తుంది. వ్యాధి తీవ్రతను బట్టి గిట్టలు ఊడిపోయే ప్రమాదం సైతం ఉంటుంది. ఈ తరహా వ్యాధి లక్షణాలు మేకలు, గొర్రెల్లో గుర్తిస్తే తక్షణమే స్పందించాలి. వ్యాధి సోకిన గిట్టలను 10 శాతం మైలతుత్తం ద్రావణం (కాఫర్ సల్ఫేట్) లేదా 10 శాతం జింకు సల్ఫేట్ ద్రావణం, లేదా 10 శాతం పోటాషియం పర్మాంగనేట్ లేక 5 శాతం ఫార్మలిన్ ద్రావణంలో నడిపించి వాటి కాళ్లను శుభ్రం చేయాలి. ఇలా రోజుకు రెండుసార్లు చేయడం ద్వారా ఫలితముంటుంది. వైద్యుల సూచనలు మేరకు యాంటీ బయాటిక్ మందులను దాదాపు నెల రోజుల వరకూ పూత పూయాలి. అలాగే అదనంగా పెరిగిన గిట్టలను కత్తిరించాలి.

పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి



మేకలు, గొర్రెల్లో కాలి పుండు వ్యాధి వ్యాప్తి చెందకుండా ఉండాలంటే వ్యాధి సోకిన జీవాలను మంద నుంచి వేరు చేయాలి. మందలను చిత్తడి, నీరు నిల్వ నేలలకు దూరంగా ఉంచాలి. మందను కాసే ప్రదేశాల్లో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యతనివ్వాలి. ఎప్పటికప్పుడు వైద్యులు సూచనలు మేరకు మందులు వేయాలి.

– కె.రమణ, పశువైద్యాధికారి, ఎచ్చెర్ల

కార్మికుల భద్రతకు ప్రాధాన్యమివ్వాలి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో పారిశ్రామిక భద్రతపై కఠినంగా వ్యవహరించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. సోమవారం ఆయన అధ్యక్షతన పరిశ్రమల భద్రతపై జూమ్ మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల భద్రతే ప్రథమ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. పరిశ్రమల యాజమాన్యాలు భద్రతపై పూర్తి శ్రద్ధ వహించాలని స్పష్టం చేశారు. రెండు వారాల్లోగా అన్ని ఫ్యాక్టరీలు సేఫ్టీ ఆడిట్ పూర్తి చేసి, నివేదిక సమర్పించాలన్నారు. ప్రమాదకర పరిశ్రమలు తప్పనిసరిగా ఆఫ్‌సైట్ ఎమర్జెన్సీ ప్లాన్‌ను తయారు చేయాలని, పరిశ్రమల వద్ద ఎమర్జెన్సీ కమాండ్ కంట్రోల్ రూమ్ ఉండాలని పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా పాశమైలారంలో ఇటీవల జరిగిన ఘోర ప్రమాదాన్ని గుర్తు చేసుకున్నారు. జిల్లాలో అటువంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, అగ్నిమాపక అధికారి మోహనరావు, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రాంబాబు, పరిశ్రమల శాఖాధికారులు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు, ఆంధ్ర ఆర్గానిక్స్, అరబిందో, శ్రేయస్, ఇతర పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయాలి



బైక్ ర్యాలీ చేపడుతున్న సీఐటీయూ నాయకులు

ఎచ్చెర్ల: ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు జూలై 9వ తేదీన చేపట్టనున్న అఖిల భారత సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, కార్యదర్శి ఎన్‌వీ రమణలు పిలుపునిచ్చారు. సోమవారం సమ్మె జయప్రదం చేయాలని కోరుతూ చిలకపాలేం నుంచి ఎచ్చెర్ల ఆంధ్ర బ్యాంక్ వరకూ బైక్‌ర్యాలీ నిర్వహించారు. కార్మిక హక్కులను కాలరాసే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు, కార్మికులు పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాగార్జున అగ్రికెమ్, శ్యాంపిస్టన్స్ యూనియన్ నాయకులు చిక్కాల సత్యనారాయణ, పి.దుర్గాప్రసాద్, అంబటి సత్యనారాయణ, డి.కుమార్, ఎస్.రమణ, ఎం.అశోక్, పి.సంతోష్, పి.శ్రీనివాసరావు, ఎస్.శ్రీనివాసరావు, ఎం.సునీల్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా మారు రథయాత్ర



పూజలందుకుంటున్న ఉత్సవమూర్తులు



ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక గుజరాతీపేటలోని గుడిసెనగుళ్ల వద్ద గత పది రోజులుగా జరిగిన రథయాత్ర ఉత్సవం సోమవారం తిరువీధితో ముగిసింది. సుభద్ర, బలభద్రుల సమేత శ్రీజగన్నాథస్వామి మూర్తులను హిందూ సాంప్రదాయంలో పెంట సోదరులు పూజలు నిర్వహించారు. సాయంత్రం జగన్నాథ, సుభద్ర, బలభద్రుల ఉత్సవమూర్తులను రథంపై ఉంచి ఊరేగింపుగా పలువీధుల్లో తిరిగి ఆలయానికి చేర్చారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించండి

జి.సిగడాం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానాన్ని కొంతమంది ఆక్రమించారని, అందువలన ఆక్రమణలు తొలగించి విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ప్రిన్సిపాల్ మైలపల్లి శ్రీనివాసరావు, పలువురు టీడీపీ నాయకులు తహసీల్దార్ మహాదేవు సరితకు సోమవారం వినతిపత్రం అందజేశారు. దీనిపై తహసీల్దార్ మాట్లాడుతూ కళాశాలకు సంబంధించిన రికార్డులు పరిశీలించిన అనంతరం చర్యలు తీసుకుంటామన్నారు.

నేడు వైఎస్సార్ జయంతి వేడుకలు

జి.సిగడాం: మహానేత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలు మంగళవారం వైభవంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉదయం 9 గంటలకు మండలంలోని సర్వేశ్వరపురం కూడలిలో ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్దకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి రావాలని మండల పార్టీ అధ్యక్షుడు డోల వెంకటరమణ సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కూడలిలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించనున్నట్లు వెల్లడించారు.

ఆకట్టుకున్న హరికథ



హరికథా గానం చేస్తున్న విశ్వనాథం భాగవతార్

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక బాపూజీ కళామందిర్‌లో సుమిత్రా కళా సమితి ఆధ్వర్యంలో దివంగత పులఖండం శ్రీనివాసరావు స్మారకంగా హరికథా నవరత్నల ప్రదర్శనలు రెండోరోజు హరికథా ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా విశ్రాంత ఏసీటీవో కిల్లాన ఫల్గుణరావు మాట్లాడుతూ సుమిత్రా కళా సమితి అన్నిరకాల కళలకు సాకారం అందిస్తోందన్నారు. అనంతరం నెల్లూరుకు చెందిన కొండపల్లి విశ్వనాథం భాగవతార్‌ని నవరత్నముల సెట్, దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. పిదప 'తులసీ జలంధర' కథను విశ్వనాథం భాగవతార్ చక్కగా వినిపించగా, వీరికి వయోలిన్‌పై దుంపల ఈశ్వరరావు, మృదంగంపై మావుడూరు సూర్యప్రసాద శర్మలు వాద్య సహకారం అందించారు. కార్యక్రమంలో సుమిత్రా కళాసమితి అధ్యక్ష, కార్యదర్శిలు ఇప్పిలి శంకరశర్మ, గుత్తు చిన్నారావు, నక్క శంకరరావు, బంకుపల్లి రమేష్‌శర్మ, కొంక్యాన మురళీధర్, వీవీఆర్ మూర్తి, ఎం.రాజు, ఎం.వరలక్ష్మిలు పాల్గొన్నారు.

స్వర్ణ కిరీటానికి వితరణ



అర్చకుడికి విరాళం అందజేస్తున్న దాత

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక డీసీసీబీ కాలనీలో వేంచేసిన భూ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో కొలువైన వేంకటేశ్వరస్వామికి స్వర్ణ కిరీటం నిమిత్తం మొదలవలస ప్రసన్నకుమార్, సంధ్యారాణి దంపతులు రూ.లక్ష, డాక్టర్ లఖినేని లక్ష్మి రూ.1 లక్ష, రోణంకి సూరన్‌నాయుడు రూ.60 వేలు, సలుగు పరంజ్యోతి, నవీన్‌కుమార్ దంపతులు రూ.10,116లు, గోవిందరావు, ఉషశ్రీ దంపతులు రూ.10,016లు అర్చకులు గోపాలాచార్యులకు సోమవారం వితరణగా అందజేశారు.

9న అఖిల భారత సమ్మె



కాంప్లెక్స్ నుంచి బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం కేంద్ర, కార్మిక సంఘాల పిలుపు మేరకు జూలై 9న అఖిల భారత సమ్మె జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా గౌరవ సలహాదారు చిక్కాల గోవిందరావు పిలుపునిచ్చారు. సోమవారం జూలై 9న సమ్మె జయప్రదం చేయాలని కోరుతూ కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి సూర్యమహల్ మీదుగా ఏడు రోడ్ల జంక్షన్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బైక్ ర్యాలీ ముగింపు సమావేశం ఏడు రోడ్ల జంక్షన్ వద్ద నిర్వహించారు. కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో కనీస వేతనం నెలకు రూ.26వేలు నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాధనంతో నిర్మించుకున్న విశాఖపట్నం స్టీల్ ప్లాంట్, ప్రభుత్వరంగ పరిశ్రమలు, రైల్వేలు, బ్యాంకులు, ఎల్ఐసీ, రక్షణ రంగం, గనులు, ప్రకృతి వనరులను కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు ప్రైవేటీకరణను వేగవంతంగా అమలు చేస్తున్నారని విమర్శించారు.

శాఖల సమన్వయంతో స్పష్టమైన కార్యాచరణ

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో ఆదాయ సృష్టి, గ్రామీణ ఉపాధిపై దృష్టి సారించి వివిధ శాఖల సమన్వయంతో స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికలను రూపొందిస్తున్నామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. సోమవారం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లాస్థాయి సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశంలో కెపాసిటీ బిల్డింగ్ ట్రైనింగ్, వ్యవసాయ విస్తరణ, లైవ్ స్టాక్, గ్రీన్‌ఫీల్డ్ అభివృద్ధి, లోన్ రికవరీ, రీ పేమెంట్లు, వడ్డీ సబ్సిడీ అంశాలపై సమగ్రంగా చర్చించినట్లు పేర్కొన్నారు. ప్రతీ మండలంలో కనీసం ఒక మోడల్ గ్రూప్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. ఈ గ్రూప్‌లు వ్యవసాయ విస్తరణ, లైవ్ స్టాక్ పథకాలు, గ్రీన్‌ఫీల్డ్ అభివద్ధి వంటి అంశాల్లో కీలక పాత్ర పోషిస్తాయని వెల్లడించారు. క్రెడిట్ లింకేజీని బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్ కుమార్, డ్వామా పీడీ పి.సుధాకర్‌రావు, పశుసంవర్ధక శాఖ జేడీ కె.రాజగోపాల్‌రావు, వ్యవసాయ శాఖ జేడీ కె.త్రినాథ్, సెరికల్చర్ అధికారి పి.చంద్రజీవన్, ఎల్‌డీఎం పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో విధులు నిర్వహించాలి



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి చంద్రజీవన్

జి.సిగడాం: గ్రామస్థాయిలో ఉద్యోగం చేస్తున్న ప్రతి ఒక్కరూ సమన్వయంతో విధులు నిర్వహించాలని మండల పరిషత్ ప్రత్యేక అధికారి పి.చంద్రజీవన్ సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన వివిధ శాఖాధికారుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 10వ తేదీన అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాలయాల్లో పాఠశాల అభివృద్ధి కమిటీ, తల్లిదండ్రుల సమావేశం నిర్వహించాలని సూచించారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయలను పరిశీలించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. వాతావరణ మార్పులు వలన గ్రామాల్లో సీజనల్ వ్యాధులు సోకకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అవసరమైన చోట ప్రత్యేక సిబ్బందిని తీసుకొని పనులు చేసుకోవాలన్నారు. విధి నిర్వహణ ఎవరైనా అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీడీవో గుంటముక్కల రామకృష్ణారావు, తహసీల్దార్ మహాదేవు సరిత, ఎంఈవోలు అరసాడ రవి, ముళ్ల శ్రీనివాసరావు, వైద్యులు బుడుమూరు యశ్వంత్, ప్రతిజ్ఞశర్మ, ఏపీవో చోళ్ల సత్యనారాయణ, ఏపీఎం రెడ్డి రామకృష్ణంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమావేశానికి సన్నద్ధమవ్వాలి



ఎచ్చెర్ల: మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకటరాజు

ఎచ్చెర్ల: లావేరు మండల విద్యా వనరుల కేంద్రంలో జూలై 10వ తేదీన జరగనున్న మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశానికి పాఠశాల స్థాయిలో సన్నద్ధమవ్వాలని ఎంపీడీవో పి.వెంకటరాజు సూచించారు. ఈ మేరకు మండల విద్యా వనరుల కేంద్రంలో ఈ కార్యక్రమంపై అధికారులతో సమీక్ష సమావేశం సోమవారం నిర్వహించారు. సమావేశంలో ఎంఈవో మురళీకృష్ణ, ఎస్ఐ జి.లక్ష్మణరావు, ఏపీవో సత్యవతి, వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలో ఈనెల 10న మెగా పేరెంట్స్ సమావేశం నిర్వహించనున్నట్లు శ్రీకాకుళం ఎంఈవో కృష్ణారావు సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. సమావేశానికి సంబంధించిన నిర్వహణ కమిటీలు ఏర్పాటు చేయాలని, విద్యార్థుల తల్లిదండ్రులంతా తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. ఈ పేరెంట్స్ సమావేశంలో విద్యార్థులకు సంబంధించి హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను అందించనున్నట్లు తెలియజేశారు.

సమావేశాన్ని విజయవంతం చేయాలి

ఎచ్చెర్ల: రణస్థలం మండలంలోని జేఆర్‌పురం పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న శ్రీవేంకటేశ్వర కల్యాణ వేదికలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు ఎచ్చెర్ల నియోజకవర్గ స్థాయి అవగాహన కార్యక్రమానికి లావేరు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, యువత, అభిమానులు తరలిరావాలని లావేరు మండల యువజన విభాగం అధ్యక్షుడు బాలి శ్రీనివాసనాయుడు సోమవారం ఒక ప్రకటనలో కోరారు.

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బాబూ ష్యూరిటీ – మోసం గ్యారెంటీ పేరుతో ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు.

అలంకారప్రాయంగా..!

- ప్రయాణికుల ఆరోగ్యం పట్టించుకోని ఆర్టీసీ అధికారులు
- నిరుపయోగంగా ప్రథమ చికిత్స బాక్స్‌లు



పల్లె వెలుగు బస్సులోని ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లో మందులు లేని దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం సుఖవంతం అంటూ ప్రకటనలు గుప్పిస్తున్న రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సుల్లో ప్రథమ చికిత్స బాక్స్(ఫస్ట్ ఎయిడ్ బాక్స్)లు అలంకారప్రాయంగా మారాయి. బస్సు ప్రమాదానికి గురైనా, ప్రయాణికులకు ఏదైనా ప్రమాదం జరిగినా అప్పటికప్పుడు తాత్కాలిక వైద్య సేవలు అందించేందుకు ప్రతీ ఆర్టీసీ బస్సులో ఫస్ట్ ఎయిడ్ బాక్స్ ఉండాలి. అందులో అత్యవసర మందులు, కట్టు కట్టే కాటన్ బ్యాండేజ్, కత్తెర, ఆయింట్‌మెంట్ ఇలా ఒక కిట్ తప్పనిసరిగా అందుబాటులో ఉండాలి. అయితే ప్రస్తుతం చాలా ఆర్టీసీ బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్సులు ఉంటున్నా అందులో మందులు ఉండడం లేదు. దీంతో ప్రయాణంలో చిన్నపాటి గాయాలైనా ప్రయాణికులు దగ్గరలో ఉన్న ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

మోటారు వాహన చట్టానికి తూట్లు

కేంద్ర మోటారు వాహన చట్టం 1939 ప్రకారం ప్రయాణికుల వాహనాల్లో తప్పనిసరిగా ప్రథమ చికిత్స బాక్స్‌లు ఏర్పాటు చేసి, వాటిలో అత్యవసర మందులు, చికిత్సకు అందించే వస్తువులు ఉంచాలి. ఈ మోటారు వాహన చట్టాన్ని మరింత పటిష్టం చేస్తూ 1988లో మరిన్ని సవరణలు చేశారు. నిబంధనల ప్రకారం ప్రథమ చికిత్సకు అవసరమైన మందులు, ఇతర అవసరమైన వస్తువులను బాక్సులో ఉంచాలి. లైసెన్స్ పొందే ముందు బస్ డ్రైవర్, కండక్టర్ వారం రోజులపాటు ప్రథమ చికిత్స అందించడంపై తప్పనిసరిగా శిక్షణ పొంది ఉండాలి. ప్రతి మూడేళ్లకు ఒకసారి లైసెన్స్ పునరుద్ధరించుకోవాలని చట్టం చెబుతోంది. ప్రయాణికులు గాయపడితే వారికి ప్రథమ చికిత్స చేసే సామర్థ్యం బస్సు డ్రైవర్, కండక్టర్లకు ఉంటుంది. అయితే రవాణాశాఖ అధికారుల నుంచి బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు పొందే సమయంలో మాత్రమే మొక్కుబడిగా ప్రథమ చికిత్స బాక్స్‌లు చూపుతున్నారు తప్ప, ఆ తర్వాత వాటి గురించి పట్టించుకోవడం లేదన్న విమర్శలు ప్రయాణికుల నుంచి వినిపిస్తున్నాయి.

అందుబాటులో ఉంచుతున్నాం



ఆర్టీసీ బస్సుల్లో ప్రథమ చికిత్స బాక్సులు ఏర్పాటు చేశాం. ఈ బాక్సుల్లో అత్యవసరమైన మందులు ఉండేలా డ్రైవర్, కండక్టర్లకు సూచనలిస్తున్నాం. ప్రమాదం జరిగిన సమయాల్లో వాటిని ఉపయోగించేలా చూస్తున్నాం.

– హెచ్.అమరసింహుడు, శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
శ్రీకాకుళం : 9951602845, 9951602849, 9912220367, 9705444191, 9010299083
ఎచ్చెర్ల : 9951602849
Office mail : sklmadvt@gmail.com